# గృహప్రవేశం

శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు

"క్రొత్త యింట్లోకి వచ్చేశావా?" అన్నాడు మధు మధ్య త్రోవలో కలిసి.

"లేదురా యింకా...యేదీ, యీమధ్య ముహూర్తాలన్నీ వక్రంగా వున్నయ్యట కదూ! యీ ఆదివారం మంచిదట. ప్రవేశించాలని చూస్తున్నాం" అన్నా.

"ఏమిటంకేం! మా కాపురాలున్నాయన్నమాటే... పెళ్ళి చేసుకున్న వెంటనే యిల్లు చూసుకున్నావ్; ఆ పాటకు సరిపోయింది."

"ఏమిటోరా! నాకా యిల్లు యేమంతగా నచ్చలేదు."

"అదేమిట్రా! యిల్లు లేక, యిరవై సంవత్సరాల సర్వీసు ఉన్నవాళ్ళు కూడా లివమక నడుస్తూంటే, యేదో మీ ఆఫీసరు ధర్మమంటూ రికమెండ్ చేసి యిల్లు యిప్పించారుగా...యింక యేం కావాలి?"

"ఇష్టం లేకపోవడానికి యెన్నో కారణా లున్నయ్"

"ఏమిటవి?"

"ముఖ్యంగా రెండు—— మొదటిది అత్తవారింటికీ యిల్లు దగ్గర్లో వుండటం, రెండోది. కలకత్తా చీకటి గదైనా దానికంటె మేలేమో అనిపిస్తుంది."

"నువ్వొక్కడివే వుంటున్నావా? నీ లాంటి యెంత మంది కాపురాలు చెయ్యటం లేదు.?"

"చేస్తున్నా దనుకో——కాని ఒకరికి అన్యాయమయింది మరొకరికి విషమవ్యవస్థగా? అందరి మనస్తత్వాలూ ఒక్కలాగే వుంటయ్యా?"

"నీ ఆవిడ యేమంటుంది?"

"ఆమెకేం? ఆ యిల్లు తప్పిస్తే మరో యింటికి రానంటుంది. కన్నవారిల్లు దగ్గర గదూ——నీటికీ మాటకీ పోవచ్చు."

"ఎందుకు పోతుందిరా! అది నీతో వుంది. అదుపాజ్ఞలలో వుంచుకోవాలి."

"ఇవన్నీ తరువాయి మాటలు ... మొదట యీ యింట్లో దిగటమే ఓ పెద్ద సమస్యగా తయారయింది"

"ఎందు కలా భయపడతావ్? మే మంతా పార్టీ యిస్తామంటున్నామనా సమస్య అంటున్నావు; అల్లాంటి భయం వద్దులేరా. అవన్నీ పాత రోజుల పంథాలు."

"ఇల్లాంటి సమస్యల కెవరు భయపడతార్రా. అసలు విషయం విన్నావా? మా ఆఫీసు యీ మధ్యనే ఎబోలిష్ అయిపోతుంది. అప్పుడు మా గుమస్తా లందరికీ కలకత్తా బదిలీ అవుతుందట."

"ఆ దెప్పుడు? మ వింతవర కనలేదే" ఆశ్చర్యంగా అడిగాడు మధు.

"ఏదీ...యీ మధ్యనే యీ ఏర్పాటు లన్నీ అవుతున్నయ్. అధవా నాకు బదిలీ అయిం దనుకో.యీ కొద్ది దినాలకు యింట్లో దిగి ఏం లాభం చెప్పు?"

"ఔను! అదీ నిజమే... అవుతే యేం చెయ్యబోతున్నావ్?"

""దిగిపోవాల్రా... లేకపోతే మా బంధువు లందరు మరో విధంగా తలుస్తున్నారు. నా కీ యింట్లో వుండటం యిష్టంలేక యీ కాలయాపన చేస్తున్నా ననుకొంటున్నారు."

"వాళ్ళతో నీ కేం సంబంధం వుందిరా. నీ పనుల్లో నీ ఆలోచన వుపయోగించకుండా... యీ కాలంలో ఎవరినో అనుసరిస్తే మనం బ్రతికినట్లే"

"మరేం చేస్తాం మధూ! నా పరిస్థితులలాంటివి. బంధువులకు అనుగుణంగా తిరక్కపోతే గర్వపోతు నంటారు. అందుకే అపవాదు పాలవకుండా యిడిసి తిరుగవలసి వస్తోంది."

"ఊరుకోరా! నీ లాంటి పిరికిపందల కిది కాలం కాదు తెలుసా? నువ్వెంత కాలం సంఘానికీ, బంధువులకూ, ప్రపంచానికీ లొంగి తిరుగుతావో, వాళ్ళు నిన్నంతగా అడుగు త్రొక్కుతుంటారు. ఎదురు తిరగటమే జీవితంలో ఒక ముఖ్యాంశంగా వుంచుకోవాలి."

"అల్లాగంటావ్ ... యిదొక్కటేనా! యీ గృహప్రవేశానికి విందు జరపాలట."

"ఎందుకు? ఎవరికి?" అని ఆశ్చర్యంగా అడిగాడు మధు.

శుభ సమయమని బంధువులకు విందు జరపాలట... యిల్లాంటి సమయాలు యెప్పుడోగాని సమకూడవట. యివన్నీ ప్రత్యక్షంగా నా యెదుట అనకపోయినా నా పరోక్షంగా అన్నవి చూచాయగా విన్నాను నేను."

"ఇది మరీ బావుంది... అయినా యిదేం మనం స్వంతంగా పునాదులు వేయించి కట్టించిన యిల్లా యేమన్నానా? అందులోనూ మన ఆచారాలన్నీ అద్భుతంగా వుంటాయిలే."

"అదే నేనూ అన్నానోయ్ వినిపించుకుంటే కదూ! మా వారిలో యెవరో గృహ ప్రవేశం చేశారట... అప్పుడు విందు జరిపారట. నే నెందుకు వారి అడుగు జాడల్లో నడవ కూడదని వారి వాదన. విందు అంటే మాటలా? ఎంత వ్యయ మవుతుంది? ఈ కరువు కాలంలో కాసుకి యెంత విలువుంది? ఎవరో కొన్ని వున్న వాళ్ళు చేయవలసిన కార్యాలు గానీ, మనబోటి సామాన్యు లెలా చేయగలరు? యీ ఆలోచనే వారి కుండదు."

"ఔను! నువ్వన్నవన్నీ పదునారణాల సత్యాలురా అరు నూరైనా సరే విందు జరపొద్దు. తరవాత వచ్చే పునర్మూర్తి విందాం... విని ఊరుకుందాం... అంతే! ప్రపంచాన్ని కొన్నాళ్ళయినా యెదిరించటం నేర్చుకో... అన్నట్టు, నువ్వు బదిలీ సంగతి తేలకుండానె గృహ ప్రవేశం చేస్తావన్నమాట" అన్నాడు మధు మళ్ళీ ప్రశ్నిస్తూ.

"నేను మొదటే చెప్పానుగా, అది తప్పదని. మా ఆఫీసు ఆ కొంపలో కాలిడిన వరకూ అభ్యంతర మెదురౌతోంది. కన్నవారిల్లు కడు సమీపంలో వుంటుంది కదూ! ఒకవేళ నా దురదృష్టంవల్ల బదిలీ అయిందా 'జై సీతారాం' అనుకుంటూ మళ్ళీ జెండా నెత్తాలి. వేధన వుద్యోగాలు... ఎన్ని అగచాట్లు పడాలి... దీని బదులు యే దేనా వర్తకం చేసుకుంటే బావుంటుంది"

"వర్తకం సంగతి తరువాత చూద్దాంలేరా బ్రదర్. మొదట నీ గృహ ప్రవేశం సంగతేదో కానియ్. నేను చెప్పినట్లు చెయ్యి. ఏం భయపడకు. ఎవరైనా అడుగుతా రనుకో; వెటకారంగా ఒక చిన్న ఉపన్యాసం దంచు. నీకు తెలీదు గనుకనా...నే నెందుకు చెప్పాల్లే! నే నిక వస్తాను. యెప్పుడో ఓసారి వచ్చి యిల్లు చూస్తాలే." అంటూ పోయాడు మధు.

నే నీ సంగతులే ఆలోచిస్తూ నడిచిపోతున్నా. ఇప్పుడు రెండు పెద్ద సమస్యలు, చిక్కులు విడని సమస్యలు ఎదురౌతున్నయ్. ఒకటి బదిలీ — రెండోది గృహ ప్రవేశం—ముఖ్యమైంది స్థలం మార్పు. అదే బదిలీ... యిది స్వవిషయం గనుక నాకు అతి ముఖ్యమైంది. కాని బంధువుల్లో చాలామందికి గృహ ప్రవేశం ముఖ్యాతి ముఖ్యంగా గోచరిస్తుంది. వారికి అసలు పరిస్థితులు సమగ్రంగా అవగాహన కాలేదు. బదిలీ కాబోతుందని భవిష్యత్తు నవలోకించి అనుసరిస్తే గృహ ప్రవేశం మానాలి... అప్పుడు బంధువులు ముఖ్యంగా అత్తగారు



"ఇదేం ఇల్లమ్మా కళ్ళంలాగే ఉంది" అన్నది మా మేనత్త

కష్ట కడుతాడు. అలాగని గృహంలో ప్రవేశిస్తే మూడు రోజుల ముచ్చటలా బదిలీ అయిం తరువాత యెత్తే యాలి. ఈ ఆలోచనల కంతు తెలీక చివరకు గృహ ప్రవేశం చెయ్యాలనే నిశ్చయించు కున్నాడు.

## 2

ఆదివారం రానే వచ్చింది. తెల్లవారి దగ్గరినుండీ ఒకాటే అలజడితో తిరుగుతున్నా. నే నేం చేస్తున్నానో నాకే అర్థం కాకుండా వుంది. భోజనాల గొడవ పెట్టు కోలేదు కాబట్టి బంధువుల పిల్లల్ని పిలిచాను. అందరు వచ్చారు. మా ఆవిడ తెల్లవారిం దగ్గర్నుండి కొత్త యింట్లోనే వుంది. ఇల్లు కడగటం, ముగ్గులు వేయడం, పాలు పొంగించడం, ఆరగించటం, అన్నీ సవ్యంగానే జరిగిపోయినయ్. పచ్చని తోరణాలు తెచ్చి అంతకు ముందే కట్టాను. ఇల్లంతా పిల్లలతో నిండివుంనే గాని ఒక్కరూ పెద్దవాళ్ళు లేరు. చివరకు నమ బాధ్యత వున్న అత్త కూడా రాలేదు.

ఓసారివచ్చి చూడమని, అత్తగార్ని, మేనత్తను, అక్కయ్యను రమ్మని స్వయంగా చెప్పాను. మనసులో దాక్కొన్న దుగ్ధను వెళ్ళబుచ్చలేక, ఆముదం తాగి నట్టుగా ముఖాలు పెట్టు కని రాకపోతే బావుండదని గామోసు వచ్చారు ముగ్గురున్నూ.

మా ఆవిడ వారికొక్కొడా కొస్త పరమాన్నం వడ్డించింది విస్తట్లో, కాని సపేమిరా తినమని పట్టుపట్టారు. నా కంతా అర్థమయింది. విందు లేక పోయిందన్న అక్కసు అదంతాను. మా మేనత్త నలువేపులా చూస్తూ,

"ఛ! ఛా!! యిదేం యిల్లమ్మా కళ్ళంలాగేనా వుంది? క్రొత్తగా ప్రవేశిస్తున్నప్పుడు యెంత అందంగా, లక్షణంగా వుండాలి యిల్లు? సరియైన రంగులు కూడా లేవు తలుపులకు" అంది బుగ్గపై వ్రేలు పెడుతూ ఆశ్చర్య పోతున్నట్టుగా. ఆమెకు వెనక పాటపాడి తన అభిప్రాయాల్ని వెళ్ళబుచ్చు కుందుకు మా అత్తగారు కూడా మొదలు పెట్టింది.

"అసలు, యీ దిగేందు కి సు మం త యి నా అతడి కిష్టంలేదు. ఏదైనా మన సుంటేనే కదూ... యిందులో వుండటాని కిష్టం లేనప్పు డెలావుంటేనేం?" అంది ముఖం మరోవేపు త్రిప్పుకొని.

"ఔనక్కయ్యా! కాస్త బాగు చేయించుకుంటే బంగారంలా వుంటుంది యిల్లు... డబ్బు ఖర్చు పెడితే గాని అంద మెలా వస్తుంది. మేం మాత్రం యిళ్ళలో దిగలేదా! ఎంత శ్రద్ధ తీసుకున్నారనుకున్నావ్ మీ మర్ది... ఎంతో డబ్బు ఖర్చు పెట్టారు." అంది అక్కయ్య. నేను మౌనంగా వింటున్నా ఆ విమర్శల్ని

"ధనం వ్యయ మవుతుందని జంకే వాళ్ళు యెప్పుడూ అనుభవించలేరు. ఇం తెందుకూ... ఆచారం ప్రకారం యిప్పుడు భోజనాలు పెట్టాలి. అదీ యెగ్గొట్టాడు. యింత పిసినిగొట్టయితే యెలా? సాంప్రదాయాలు మా ను కుం టా మా? అదీ శుభ సమయంలో..." అంది మేనత్త చేతులు త్రిప్పుకొంటూ. నాకు వళ్ళు మండిపోయింది. మా ఆవిడ నా వేపు కోరగా చూసింది. అన లామె కూడా వారి అడుగు జాడల్లోనే నడుస్తుంది.

"అది కా దత్తయ్యా! జబ్బుకోసం యిటికీకాదు. యెందుకు విందు జరపాలీ అంట. ఎవరో చేశారని మనం అదే పొరపాటును అనుసరిస్తే ఫలితం యేముంది.? చెయ్యబోయేది సమంజసమా, అవ సరమా, కాదా అని కనీసం ఆలోచించి చెయ్యాలి. యిప్పుడే విందు పెట్టించా లన్నంత అవసరం నాకేం కనుపించలేదు. యిదేం మన స్వంత కొంపా?" అన్నా.

"నీ దంతా ఆదో తరహా మాట్లలా...మా కేంలే. నువ్వు విందు చేయకపోతే మాకేం నష్టమొచ్చింది? మేం దానికోసమే ఆశలు వున్నామా? ఏదో నీ

(మిగిలి 62 వ పేజీలో)

## గృహ ప్రవేశం

(31 వ పేజీ తరువాయి)

గొప్ప కోసం, సాంప్రదాయం కోసమో చెప్తామే గాని" అంది మళ్ళీ మేనత్త.

"నాకు తెలుసు. యేది చెయ్యాల్సిందో, యేది అనవసరమో..." అన్నాను కోపంగా.

నాతో వాదనకు దిగడానికే వారికి భయం. మరింకేం మాట్లాడలేదు. వెంటనే తిరిగి పోయారు.

"మీరు కొద్దిగైనా వెనుకా ముందూ చూడరండి! నోటి కెంత మాటొస్తే అంతా అనేస్తారు. కాస్త అణువకు, లేదుకూడా" అంది మా ఆవిడ.

"నువ్వూరుకుందూ... మీ వాళ్ళంతా యింతే! చిన్న విషయాన్ని కొండంతగా చేస్తారు. అర్థం లేకుండా ఆచారాలంటూ అన్నీ పెద్ద పరుగులకు పోతారు. అంతా క్రోధా బుంచుకోవటమే! చూడు నువ్విచ్చిన పరమాన్నం యెవరైనా తిన్నారా? దీనికి కారణం యేమంటావ్?"

"అదేమో నాకేం తెలుసు?" అంది ఆవిడ.

"తక్కినవన్నీ తెలుసు వాదించడానికి. మనం విందు యేర్పాటు చెయ్యలేదని యీ ముఖాలు వాడి పోయాయి. అందుకే యీ నిరాకరణలు; ఒక్క నియమమయినా జాగుచేయకుండా అనవలసినవేవో అనేసి వెళ్ళి పోయారు."

"పోనీ యేం పోయింది? విందేర్పాటు చేయలేక పోయామా?"

"నీ కాపాటి ప్రపంచ జ్ఞానం యేడవ నందుకు విచారిస్తున్నా లలితా! విందుకు ఒకరా, యిద్దరా చెప్పు... మనం యిప్పుడా గొడవ పెట్టుకొన్నా మంటే బజారుని యీళ్ళై రూపాయ అయినా వుండాలి. ఇల్లాంటి చెవరో డబ్బుతో కులుకుతున్న వాళ్ళు చెయ్యగలగాలి. అయినా యిదేమంత అవసర మయిందని నే ననుకోను."

"ఏమో బాబూ నా కెందుకీ గొడవ?" అంది లలిత అక్కడితో చాలించినట్టుగా.

"తక్కినవా ళ్ళెలా అన్నా అంటారు. ఏం? మీ అమ్మయినా కాస్త ఆలోచించొద్దూ... ఆపాటి బాధ్యత తనకు లేదనుకుంటుందా? మళ్ళీ యెంతో అభిమానం వున్నదిలా బయటకు అభినయిస్తుంది. నాకీ యింట్లోకి రావటం యిష్టం లేదంటుంది... యెందు కిష్టం లేదో ఆలోచించిందీ! యీ మధ్యనే నాకు బదిలీ అయ్యే సూచన లున్నయ్యని చెప్పాను కూడా".

"మీరేవో సాకులు చెప్తుంటారు. అసలే ముందు నుండి మీ కిష్టం లేదు, యీ కొంపకు రావటం. మావా ళ్ళేమంటున్నారో తెలుసా? మీరు కావాలనే బదిలీ చేయించు కుంటున్నారట..." అంది. నాకు అమాంతంగా ఆమెకో చెంప పెట్టు పెట్టాలన్పించింది. వీళ్ళ ముందు భావనలకు, జరిగిన వాటికి యేం సంబంధం వుందా అనుకున్నా.

"మీ వాళ్ళు యేమనుకుంటే నాకేం కావాలే— అనుకోనీ! నా బుద్ధి పోయాలు వాళ్ళదగ్గరే వుంటయ్. నేను దూరాలోచన చేసి యింతవరకు యీడ్చుకొచ్చా. చివరికి ప్రవేశించక పిలయింది కాదు."

"ఏమోనండీ మీ కెవరు చెప్పగలరు? అన్నీ అడ్డవాదనలనే చేస్తుంటారు" అంటూ అక్కడ నుండి విసురుగా పోయింది.

కొన్ని దినాలు గడిచినయ్. క్రొత్త యింట్లో కాపురం వుండడం నాకు కొన్ని విధాల అనుకూలంగానే వుంది. మాఆవిడ తరచు కన్నవారింటికి పోతూండటం ఆమెకూ అనుకూలమే అనిపించింది. నేను మాత్రం యిల్లు బాగు చేయించేందుకు శ్రద్ధ చూపలేదు. లలిత ఎన్ని సార్లు చెప్పినా విన్పించుకోలేదు కూడా.

హఠాత్తుగా నాకు ట్రాన్సఫర్ ఆర్డర్ వచ్చింది. ఇన్నాళ్ళనుండి అనుకొంటున్న బదిలీ యిప్పు డకస్మాత్తు భూకంపంలా వచ్చి నన్ను కంపింప చేసింది. ఏం చేయటమా? అన్న ఆలోచన బాధించింది. పెద్ద నగరానికి బదిలీ. అక్కడి వాతావరణం, అక్కడి ప్రజలు, అక్కడి సరకుల ధరలు యివన్నీ నాకు సరిపడవేమో ననుకున్నా. కాని యేంచేయను? తప్పించు కోవాలని గావించిన బ్రహ్మ ప్రయత్నాలు కూడా విఫలమై వెళ్ళక తప్పింది కాదు.

"చూశావా లలితా నేను చెప్తే యెవ్వరైనా నమ్మారా? కనీసం వినిపించు కున్నారూ? ఇప్పుడు బదిలీ అయిందా? యీ మూన్నాళ్ళ ముచ్చటకోసం గృహప్రవేశం చేశాం...దాని కెన్నో రాద్ధాంత సిద్ధాంతాలు జరిగినయ్. విందులు జరిపొంకాదని ఒకరు గేలి చేశారు. యిల్లు బాగుచేయించలేదని మరొకరన్నారు...యిప్పు డేమయింది?" అన్నా. నా మాటలు లలితకూడా విచిత్రంగా కన్పించాయి. ఆమె కూడా నన్ను విశ్వసించలేక పోయింది.

"అదేమోనండీ! మీ యిష్టం. మీరు కావాలనే బదిలీ చేయించుకుంటుంటే యెవరేం చేస్తారు? అక్కడికెళ్ళాక యెంతకష్టమో ఆలోచించారూ?" అంది.

"ఏం కష్టం. యిక్కడెలా వుంటున్నామో అలాగే అక్కడ కూడాను. నేను మొదట పోయి కొన్నాళ్ళ తరువాత అద్దె కొంప చూస్తాను. హాయిగా యీ బంధువుల బాధల్లేకుండా వుండొచ్చు. పాపం! నీకు కష్టంగా వుంటుందిలే... కన్నవారు కాస్త దూర మౌతారు" అన్నా నవ్వుతూ.

"వాళ్ళెండి... యిదొహటి దొరికింది యెత్తి పొడుపుకి. ఏం? ఎప్పుడూ కన్నవారింట్లోనే కూర్చుంటున్నానా? మీరెక్కడుంటే అక్కడ వుండవలసిందేగా! యింక మరో పది వూళ్ళు తిప్పండి నాకేం? ఆ వున్న కాస్త ఆరోగ్యం చెడుతుంది. అప్పుడు ఫలితం తెలిసొస్తుంది" అంది కోపంగా. ఆమె కోపానికి కారణం నాకే తెలుసు. మరేం పెంచుకోకుండా వూరుకున్నా.

బంధువుల్లో యెవ్వరూ నమ్మకుండా వున్నారు బదిలీ దానంతటదే వచ్చిందని. వాళ్ళంతా నా కోరిక పైనే, నా ప్రయత్నం మీదనే యిది జరిగిందనుకొంటున్నారు. నా ఖర్మం చేసుకోకపోతే నేను మాత్రం యేం చేస్తాను?... మరేం వాదోప వాదాలు లేకుండా లలితను వాళ్ళ కన్నవారింటిలో వుంచేసి, నేనే ఒంటరిగా కలకత్తా పోయాను బదిలీపై... నా గృహప్రవేశంలో అర్థం యేముం దంటారు? మూన్నాళ్ళ ముచ్చటే కదూ!

★

## నిరీక్షణ

(21 వ పేజీ తరువాయి)

రనీ, తిడతారనీ కాదు; తను వాక్చాతుర్యాన్ని ప్రదర్శించడంలో విఫలుడైతే వాళ్ళెక్కడ విముఖత్వం పొందుతారోనని అంతే! అందుకే సంకోచించేవాడు.

ఆమె మధ్య వయస్కురాలు. ఈ క్షత్రియ కులానికి చెందింది కాకపోయినా మనిషి శుభ్రంగా ఉండడంవల్లా మంచి ఆకర్షణ కలిగివుంది. చామనఛాయగా వుంటుంది. మొహం అజంతా శిల్పాన్ని గుర్తుకు తెస్తుంది.

ఆమె వ్యక్తిగత ఆకర్షణకంటే, ఆ అంతులేని నిరీక్షణే చంద్రకుమార్ ను ఆకర్షించింది.

ఇదివరకటి పోస్టుమాస్టర్ అతనికి చార్జి ఇచ్చేటప్పుడు చెప్పాడు ఆవిడ ఈ విధంగా గత రెండు సంవత్సరాలనుండి వస్తోందని. కారణం అతనూ చెప్పలేదు.

పాపం, భర్త దూరదేశాల్లో, ఏ మిలిటరీ లోనో చిక్కుకున్నాడేమో? అతని నుండి ప్రేమ లేఖల కోసం ఎదురు చూస్తోందేమో? అదే నిజమైఉంటుంది. నిజంగా ఆడవాళ్ళంత ప్రేమైక జీవులు ఎవరూ వుండరు? వాళ్ళు ప్రేమ దేవతను, పూజారులను కూడా దానవులవుతారు; పురుషులే, నీచంగా; వాళ్ళ హృదయ సౌకుమార్యాన్ని గమనించకుండా, హీనంగా చూసి హింసిస్తారు. స్త్రీలే అసలైన ప్రేమ దేవతా మూర్తులు!

అతనికి ఆ స్త్రీని ఇలా విడిచిపోయిన భర్తపైన ఎడతెగని కోపం వచ్చింది. ఎన్నో శాప నార్థాలు పెట్టాడు.

"రేపు ఏమైనా అడిగేస్తాను. వాడి అంతు కనుక్కొంటాను సహాయపడి, ఆవిడ జీవితాన్ని సుఖమయం చేస్తాను" అని నిర్ణయించుకున్నాడు.

అనుకున్న ముహూర్తం రానే వచ్చింది! రోజూ వలెనే ఆవిడ వొచ్చి, తలొంచుకుని:

"నాకేమన్నా....?" అంది.

"లేదు. కాని...." అన్నాడు ఏదో చెప్పేవాడిలా, అతను.

విశాల నేత్రాలతో ఒకసారి, "చెప్పండి" అన్నట్టు వీక్షించింది.

"నా అనవసర ప్రశ్నను క్షమిస్తారనే ఉద్దేశంతోనే అడుగుతున్నా. మీరు మరోలా భావించకండి! మీరు నిరీక్షించేది దేనికోసమో, దయ ఉంచి, చెప్పగలరా?" అన్నాడు తడబడుతూ.

ఆవిడ:—"ఆఁ! ఏమీ లేదండీ! రెండేళ్ళ క్రితం జరిగిన ఎలక్షన్లలో ఓటువేస్తే మనియార్డరు పంపుతామని చెప్పారు; అందుకని" అంది నిస్సంకోచంగా.

చంద్రకుమార్ 'ఏ చంద్రలోకంనుంచో క్రింద పడుతున్నా నా?' అనుకోసాగడు ★